# పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- నోడల్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం


స్వీప్ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికలకు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని, సామగ్రిని ముందస్తుగా సమకూర్చాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ నోడల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నవంబర్ 30న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎలక్షన్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, సీ విజిల్, సువిధ వంటి యాప్‌లపై ప్రచారం నిర్వహించాలన్నారు. పోలింగ్‌కు అవసరమైన వాహనాలను సమకూర్చాలన్నారు. పోలింగ్ సిబ్బదికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో మోడల్ కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. స్వీప్ కార్యక్రమంలో భాంగా ఓటు హక్కు వినియోగంపై రూపొందించిన స్టిక్కర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు బీఎస్ లత, టీఎస్ దివాకర, ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్, స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై కలెక్టర్, జిల్లా జడ్జిలు జిల్లాస్థాయి కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై నిరంతర పర్యవేక్షణ, నిఘా పెంచి ఫాం ఎస్ ఆడిట్ జరిపించాలన్నారు. నింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించిన దవాఖానలు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణుల వివరాలను ఖచ్చితంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, రికార్డులను వైద్యాధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. కొత్త స్కానింగ్ సెంటర్లు తెరిచేందుకు అనుమతి ఇచ్చే ముందు ప్రమాణాలపై పూర్తిగా తనిఖీ చేసి జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. చట్ట ప్రకారం నిర్వహిస్తున్న దవాఖానలకు, గడిచిన కాలంలో వారి ప్రవర్తనను పూర్తిగా పరిశీలించిన తర్వాత మాత్రమే లైసెన్స్‌లు రెన్యువల్ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి నీలిమ మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానల్లో స్కానింగ్ సౌకర్యాలు మెరుగుపర్చి ప్రతి గర్భిణి ప్రభుత్వ దవాఖానలోనే స్కానింగ్ చేసుకునేలా చర్యలు చేపడితే ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు వాటంతటఅవే తగ్గిపోతాయన్నారు. ప్రభుత్వ దవాఖానలకు వచ్చే గర్భిణులు, రోగులతో మర్యాదగా ప్రవర్తిస్తూ స్నేహపూర్వకంగా వైద్య సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల ఆవరణలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తే ప్రజలకు ఉచిత వైద్య సేవలపై అవగాహన కలగడంతోపాటు నమ్మకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎస్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎండీ సమీయుద్దీన్, డాక్టర్ ఏ శ్రీనివాస్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెక్రటరీలు అజయ్‌రెడ్డి, జగదీశ్వర్, ఆనంద్‌బాబు, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి స్వామి, డెమో తులసిరమణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టాలి

- ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలి
- పోలీస్ అధికారులకు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశం


సమావేశంలో మాట్లాతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలపై పోలీస్ అధికారులు నిఘా పెంచాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం అసెంబ్లీ ఎన్నికల నియమావళి, ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అప్రమత్తంగా ఉండి ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్షన్లకు ముందు, ఎలక్షన్ రోజు, ఎన్నికలు పూర్తయిత తర్వాత చేపట్టాల్సిన విధులపై పోలీసులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రతి పోలింగ్ కేంద్రంపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వీఐపీల రాక ఎక్కువగా ఉంటుందని, దీనికి సంబంధించిన పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ప్రచార వాహనాలు, ఎన్నికల ర్యాలీలు, సభలకు అనుమతులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ సిబ్బందికి వివరించారు. నిత్యం వాహనాల తనిఖీ నిర్వహించి నగదు, బంగారు నగలు, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. సీజ్ చేసిన వాటిని జిల్లా ఎన్నికల కమిటీకి అప్పగించాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వాహకులపై దాడులు చేసి పట్టుబడ్డ వారిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో బ్లూకోల్ట్స్, పోలీసులు తరచూ పర్యటిస్తూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. సమస్యలు సృష్టించే వారిని ముందస్తుగా గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. జిల్లాలో నేటి వరకు రూ.22,71,446ల నగదు, రూ.12,26,577 విలువైన 2524 లీటర్ల మద్యం సీజ్ చేశామని వెల్లడించారు. చెక్ పోస్టుల దగ్గర, ఇతర ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. లాంగ్ పెండింగ్, నాన్ బెయిలబుల్ వారంట్లను త్వరగా అందజేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, రవీంద్రరెడ్డి, సురేశ్, డీవీ రంగారెడ్డి, ఎస్‌బీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు, జగిత్యాల టౌన్ సీఐ నటేశ్, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ

## బాధిత కుటుంబాలకు పరామర్శ

జగిత్యాల రూరల్, అక్టోబర్ 18: జగిత్యాల పట్టణ బీఆర్‌ఎస్ యువ నాయకుడు దోనకంటి సాయిరామ్ మృతి చెందగా బుధవారం పోతారం గ్రామంలో అతడి కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామానికి చెందిన రాచమడుగు వెంకట్రావు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట జడ్పీటీసీ రామ్మోహన్ రావు, ప్యాక్స్ చైర్మన్ సాగర్ రావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి శరత్ రావు, డా, అనూప్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ డిజిటల్ చెల్లింపులపై అపోహలు వద్దు

జగిత్యాల అక్టోబర్ 18: విద్యుత్తు వినియోగదారులు డిజిటల్ చెల్లింపుపై ఎలాంటి అపోహలు చెందవద్దని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 జిల్లా కార్యదర్శి ఎన్ రాంజీ నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతంలో విద్యుత్ వినియోగదారులకు బిల్లుల చెల్లింపులపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డిజిటల్ విధానాల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తే వెంటనే అప్‌డేట్ అవుతుందని, దీనిపై ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి మెరుగైన విద్యుత్‌ను పొందడానికి సంస్థకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏవో భూమేశ్, జేఏవో రాజేశం, ఎల్ ప్రకాశ్, రమేశ్, సుధాకర్, ఎండీ తాప్రోజ్ పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం అందజేత

కొడిమ్యాల, అక్టోబర్ 18: మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన జంగ మల్లేశం–లహరి దంపతులు శాశ్వత చందాదారులుగా రూ.25,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నాగరాజు రమేశ్‌కు నగదును అందజేయగా వారికి స్వామివారిని దర్శింపజేసి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులుఉన్నారు.

# చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలి


దేశాయిపేటలో ప్రచారంలో పంచాయతీ కార్మికులతో భోజనం చేస్తున్న జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు

మేడిపల్లి, అక్టోబర్ 18 : బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, రాజరత్నాకర్‌రావు కోరారు. బుధవారం భీమారం మండలం దేశాయిపేట గ్రామంలో కారు గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉదగిరి రమ్య, ఆదిరెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, సర్పంచులు నాంచారి స్వప్న, రాజేందర్, ఎంపీటీసీ మకిలి దాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ హైమద్, నాయకులు దోనకంటి వంశీ రావు, నెల్లుట్ల ప్రభాకర్, రావు శ్రీనివాస్‌రావు, దురిశెట్టి లక్ష్మణ్‌కుమార్, చెన్నమనేని అజిత్‌రావు, తన్నీరు శ్రీనివాస్‌రావు, దేశవేని కృష్ణ, ముక్కెర గంగాధర్, గండ్ర సురేందర్‌రావు పాల్గొన్నారు.

## ఘనంగా ముద్దు రామకృష్ణయ్య జయంతి

జగిత్యాల, అక్టోబర్ 18: జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో ముద్దు రామకృష్ణయ్య మెమోరియల్ సేవాసదన్ ప్రధాన కార్యదర్శి సూరజ్ శివ శంకర్ ఆధ్వర్యంలో ముద్దు రామకృష్ణయ్య 116వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు శిష్యులు పాల్గొని, రామకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలిమెల్ల సత్తయ్య, ఎర్ర తిరుపతి, అయ్యవారి లక్ష్మీనారాయణ, పెద్ది ఆనందం, బాలగంగాధర్, దేవరశెట్టి జనార్దన్, ఊటూరి నీలకంఠం, గౌరీశంకర్, దువ్వాసి శ్రీహరి, డిండిగాల ప్రభాకర్, కారంగుల లక్ష్మణ్, తాటిపెల్లి ఆనందం, ఆవారి కైలాసం, అలిశెట్టి ఈశ్వరయ్య, కస్తూరి కిషన్, వైనిలచ్చన్న, కప్పల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదకు చేయూత

జగిత్యాల, అక్టోబర్ 18: జిల్లా కేంద్రంలో వేముల రాజు (42) అనే నిరుపేద మృతి చెందగా శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి చేయూతనిచ్చింది. దహన సంస్కారలకు రూ. 5వేల ఆర్థిక సహాయంతోపాటు, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ జగిత్యాల పట్టణాధ్యక్షుడు అలిశెట్టి ఈశ్వరయ్య, సేవా సమితి అధ్యక్షుడు చిలుక మారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు జోగ మల్లేశం, వేముల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రాయికల్, అక్టోబర్ 18: పట్టణంలో నిర్వహించే దసరా, బతుకమ్మ వేడుకలకు మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మ, దసరా పండుగలను నిర్వహించే ప్రదేశాల్లో ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్, కౌన్సిల్ సభ్యులు బుధవారం పరిశీలించారు. అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్ గౌడ్, దివ్య అనిల్, ఏఈ ప్రసాద్, మేనేజర్ వెంకట్ సిబ్బంది పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా బత్తిని శ్రీనివాస్ S/o. రాజయ్య R/o. ఆదర్శనగర్, మెట్‌పల్లి, జగిత్యాల జిల్లాగారు మార్టిగేజ్ లోను నిమిత్తము జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో సర్వేనెం. 1186, విస్తీర్ణం 128 చ.గ.లలో తన తండ్రి గారైన రాజయ్య పేరున గల RCC ఇల్లు నెం. 1-8-296/D/2 గల దానిని HDFC BANK LTD మెట్‌పల్లి బ్రాంచ్ గారికి తనఖా పెట్టుటకు దరఖాస్తు సమర్పించినారు. లోగడ బత్తిని రాజయ్య గారు ఇట్టి ఇల్లు 1) బత్తిని శ్రీనివాస్ 2) బత్తిని సంతోష్ 3) బత్తిని వేణుగోపాల్ ముగ్గురి తండ్రి రాజయ్య R/o. ఆదర్శనగర్, మెట్‌పల్లి గార్ల నుండి రిజిస్టర్డ్ జాయింట్ రైట్స్ రిలీజ్ డీడ్ నెం. 831/2019 ద్వారా పొందినారు. ఇట్టి డాక్యుమెంటు యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు రిజిస్టర్డ్ సేల్‌డీడ్ నెం.2712/2006 పోయినదని బత్తిని రాజయ్య గారు తెలిపినారు. కావున ఇట్టి దస్తావేజు పై గాని లేదా తనఖా పెడుతున్న ఇంటి పై గాని ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న యెడల వ్రాత పూర్వక ఆధారాలతో (7) రోజులలో క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. లేని యెడల ఎలాంటి అభ్యంతరములు లేవని భావించి సదరు లోను మంజూరు విషయంలో HDFC BANK LTD మెట్‌పల్లి బ్రాంచ్ వారు ప్రొసీడుకాగలరు.

ఇట్లు: సాన చంద్రమోహన్
అడ్వకేట్ (TS/138/1995) ప్లాట్ నెం.303,
శ్రీసాయి ఎవెన్యూ ముకరంపుర, కరీంనగర్.
సెల్ :9666077777, 9141499999